క్లుప్తంగా

చౌడేశ్వరిదేవి ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి కర్నూలు పట్టణం ఆశోక్ నగర్ కాలనీకి చెందిన యెరిగెరి రామకృష్ణ, నిర్మల దంపతులు రూ.25వేల విరాళాన్ని అందజేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి మంగళవారం తెలిపారు. దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉమామహేశ్వరుడికి వెండి కంఠాహారం కానుక





ఆలయ సిబ్బందికి కంఠాహారం అందజేస్తున్న దాత

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం భీమునిపల్లె గ్రామానికి చెందిన భక్తుడు జె.వీరారెడ్డి 360 గ్రాముల వెండి కంఠాహారాన్ని మంగళవారం విరాళంగా సమర్పించారు. సుమారు రూ.60 వేల విలువ చేసే ఈ కంఠాహారాన్ని స్వామివారిపై భక్తితో సమర్పించినట్లు ఆలయ ఈఓ పాండురంగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా దాత వీరారెడ్డిని ఆలయ అధికారులు సన్మానించి, స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు. యాగంటిపల్లె గ్రామ ఉపసర్పంచ్ బండి మౌలీశ్వర రెడ్డి, ఆలయ సిబ్బంది ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఆత్మబంధువు సభ్యులు

డోన్: స్థానిక రైల్వే జంక్షన్ రెండో ప్లాట్‌ఫారంపై మంగళవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో ద్రోణాచలం సేవా సమితి ఆత్మబంధువు సభ్యులను సంప్రదించారు. వారి ఆధ్వర్యంలో హిందూ శ్మశానవాటికలో సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఖర్చును ప్రొద్దుటూరు నివాసి చరణ్‌తేజారెడ్డి భరించారని సేవాసమితి వ్యవస్థాపకుడు షాధిఖాన రాజు తెలిపారు. సభ్యులు గురుస్వామి, ఉదయ్ కిరణ్‌తో పాటు రైల్వే కానిస్టేబుళ్లు కృష్ణమూర్తి, నరసింహులు పాల్గొన్నారు.

విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న ఉపాధ్యాయులు

అవుకు(కొలిమిగుండ్ల): అవుకు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని వర్షిని టోబాకో అవగాహన సదస్సులో జిల్లాలో మొదటి బహుమతి సాధించింది. ఇటీవల నంద్యాలలో జరిగిన కార్యక్రమంలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. వర్షిని అవగాహన కల్పించి ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం మల్లీశ్వరితో పాటు ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

పెద్దలను గౌరవించడం సంస్కారం



విద్యార్థులకు బహుతులు ప్రదానం చేస్తున్న మండల ఖాజీ నూర్ అహ్మద్

బేతంచెర్ల: ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు, గురువులను గౌరవించి సమాజంలో ఆదర్శంగా నిలవాలని మండల ఖాజీ నూర్‌అహ్మద్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా హుసేన్ సూచించారు. పట్టణంలోని షాదిఖానాలో మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ ఖాజా హుసేన్, కార్యదర్శి కరిముల్లా, రీడ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్, కమిటీ సభ్యులు షేక్షా, మహబూబ్‌వలి, సద్దామ్, అక్బాబ్ పాల్గొన్నారు.



డోన్ వైఎస్సార్ సర్కిల్‌లో నివాళులర్పిస్తున్న నేతలు,



కోవెలకుంట్ల: నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు,



కొలిమిగుండ్ల: బందార్లపల్లె క్రాస్ రోడ్డులో...,



బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో.. ,



సిమెంట్ నగర్ గ్రామంలో..

చెరగని జ్ఞాపకం వైఎస్సార్

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లోని ఆయన విగ్రహాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, జలయజ్ఞం వంటి పథకాలతో రైతు బాంధవుడిగా నిలిచారని, ఆరోగ్యశ్రీ, 108, 104, ఫీజురీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలతో పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. విద్య, ఉపాధి, నీటిపారుదల, రోడ్లు, పరిశ్రమలతో రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిన మహనీయుడని, ఆయన వారసత్వాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు.

- వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి
- నివాళులర్పించిన పార్టీ నాయకులు, అభిమానులు
- రాజన్న పాలనను గుర్తు చేసుకుని భావోద్వేగం



డోన్: మాజీ మంత్రి బుగ్గన స్వగృహంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

- డోన్: నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి ఎనలేని కృషి చేసి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం పొందిన నేత వైఎస్సార్ అని మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్ అన్నారు. పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సోమేష్ యాదవ్, మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌కు నివాళులర్పించారు. డోన్‌లో ఫ్లైఓవర్, హంద్రీనీవా కాల్వ, గాజులదిన్నె రక్షిత మంచినీటి పథకం, ఏపీ మోడల్, గురుకుల, కస్తూర్బా పాఠశాలలతో పాటు 3వేల మందికి ఇంటి స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయించిన ఘనత వైఎస్సార్‌దేనని గుర్తు చేశారు. అలాగే మాజీ మంత్రి బుగ్గన స్వగృహంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, పార్టీ నాయకులు దొరపల్లె చిరంజీవి, ఈశ్వర్, కౌన్సిలర్లు రైల్వే నాగేంద్ర, ఆర్ట్ రమణ, పాలుట్ల రఘురాం, నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మద్దయ్య, పార్టీ నాయకులు క్వాలిటీ అబ్దుల్లా, ధారా ప్రతాప్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు కుమ్మరి రాజు, పాతపేట రఫీ, కురుకుందు హరి, కటిక వేణు, ఆర్‌ఈ రాజవర్ధన్ వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. వైఎస్సార్ సర్కిల్‌లో మాజీ ఎంపీటీసీ గుమ్మకొండ హనుమన్న, నాయకులు బుగ్గన జయచంద్రారెడ్డి, రాజా మహేశ్వరరావు, భాస్కర్, రవి, పెయింటర్ వెంకటేష్, అశోక్, రైల్వే ప్రకాష్, ఖాజా, రాజ్‌కుమార్ పుష్పాంజలి ఘటించారు. కోట్లవారిపల్లెలో వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, వైస్ మార్కెట్‌యార్డు చైర్మన్ ఓబులాపురం మదన్, ఎంపీటీసీ సుధాకర్ యాదవ్, బొబ్బల శివరామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాబాంధవుడు వైఎస్సార్

బనగానపల్లె: వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో అమలు చేసిన పథకాలు నేటికీ ప్రజల గుండెల్లో నిలిచాయని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. పట్టణంలోని పెట్రోల్‌బంక్ కూడలి వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. రాష్ట్ర ముస్లిం మైనార్టీ నాయకుడు అత్తార్ జావీద్, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి అంబటి రవికుమార్ రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దం రామ్మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

- కోవెలకుంట్ల: పట్టణంలోని పవన్ ఏజెన్సీ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఏపీఎన్‌జీఓ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గువ్వల రామకృష్ణారెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, పాండురంగస్వామి దేవాలయ మాజీ ధర్మకర్త, రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మండల కో ఆప్షన్‌మెంబర్ దిల్కాబాషా, చిన్నబాబు, వెలగటూరు, అమడాల సర్పంచ్‌లు ఎల్వీ సుధాకర్‌రెడ్డి, బాలమద్దిలేటి, నాయకులు ఎల్‌ఐసీ రామసుబ్బారెడ్డి, గుద్దేటి చంద్రశేఖర్‌రెడ్డి, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, జశ్వంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, దశరథ రామిరెడ్డి, గజ్జెలరెడ్డి, కమలపురి జగన్, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.
- అవుకు(కొలిమిగుండ్ల): అవుకులో వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అవుకు చెరువును రిజర్వాయర్‌గా తీర్చిదిద్దిన ఘనత మహానేతదని చెప్పారు.
- బేతంచెర్ల: పట్టణంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, గిడ్డంగుల శాఖ మాజీ డైరెక్టర్ బాబుల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు, అధికార ప్రతినిధి మురళీకృష్ణ, గూనినాగరాజు ఆధ్వర్యంలో శేషారెడ్డి హైస్కూల్ ఎదురుగా ఉన్న రాజన్న విగ్రహానికి నివాళులర్పించారు. కౌన్సిలర్స్ కోట్ల మధు, చింతల నాగిరెడ్డి, పట్టణ, మండల కన్వీనర్లు జాకీర్, తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు మురళీధర్‌రెడ్డి, వెంకిరెడ్డి, బుగ్గన మధుసూదన్‌రెడ్డి, టర్కీ బాషా, శేఖరయ్య పాల్గొన్నారు. ఆర్‌ఎస్ రంగాపురంలో మాజీ సర్పంచ్ జగన్‌మోహన్ రెడ్డి, నారాయణ రెడ్డి, గురుస్వామి, రఘునాథ్‌రెడ్డి, రఘు, తిమ్మయ్య తదితరులు అన్నదానం చేశారు.
- సంజామల: ఆకుమల్లలో పార్టీ నాయకులు ఉయ్యాలవాడ కాశీం బాషా, ఉప సర్పంచ్ హాజీపీరన్, పేరం వెంకటేశ్వర్‌రెడ్డి, ముక్కమల్లలో చిరిపిరి మహేశ్వర్ రెడ్డి, ముదిగేడులో ఉసేన్ ఆలీ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఎద్దుల మోహన్ రెడ్డి, గౌరిగారి మల్లికార్జున రెడ్డి, ధర్మారెడ్డి, నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.
- ప్యాపిలి: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ పోతుదొడ్డి కృష్ణమూర్తి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, స్టేట్ బూత్ కమిటీ సెక్రటరీ బొర్రా మల్లికార్జునరెడ్డి నివాళులర్పించారు. ఉప సర్పంచ్ గద్దం భువనేశ్వర్ రెడ్డి, నాయకులు పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, రాజా మురళీకృష్ణ, దస్తగిరి, రంగస్వామి, కృష్ణారెడ్డి, ప్రేమసాగర్ రెడ్డి, విఘ్నేశ్వర్ రెడ్డి, బషీర్ పాల్గొన్నారు.

ప్రజల మదిలో వైఎస్సార్ పదిలం

కొలిమిగుండ్ల: ప్రజలు మర్చిపోలేని రీతిలో పరిపాలన సాగించిన వైఎస్ రాజశేఖరరెడ్డి నేటికి ప్రజల మదిలో పదిలంగా నిలిచిపోయారని జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. మంగళవారం కొలిమిగుండ్ల పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌తో పాటు వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఎర్రబోతుల వెంకటరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాల వద్ద నాయకులు కాటసాని ప్రసాదరెడ్డి, ఎర్రబోతుల ఉదయ్‌భాస్కర్‌రెడ్డితో కలిసి నివాళులర్పించారు. వైఎస్సార్ మార్క్‌ను ఎవరూ చెరిపేయలేరన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతో తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, నాయకులు అంబటి చంద్రమోహన్‌రెడ్డి, మూల ఈశ్వరరెడ్డి, పేరం నందకిషోర్‌రెడ్డి, బాచం మహేశ్వరరెడ్డి, పేరం రాంశంకర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, మల్లేశ్వరరెడ్డి, పెద్దిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



బేతంచెర్లలో..



ఆకుమల్లలో..





బనగానపల్లె: వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, డోన్: కోట్లవారిపల్లెలో.. ,



అవుకులో నివాళులర్పిస్తున్న చల్లా విఘ్నేశ్వరరెడ్డి,



బేతంచెర్లలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ప్రతి విద్యార్థి వ్యాపారవేత్తగా ఎదగాలి

బనగానపల్లె రూరల్: ప్రతి విద్యార్థి వ్యాపారవేత్తగా ఎదగాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎండీ గౌస్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ×ఆవిష్కాంధ్ర–ఒక కుటుంబం–ఒక వ్యాపారవేత్త అనే అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రతి కుటుంబంలో ఒకరు వ్యాపారం ప్రారంభించేలా ప్రోత్సహిస్తే బలమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. ఆవిష్కరణల ద్వారా స్వావలంబన, ఆర్థికాభివృద్ధి సాధ్యమని, ఏపీలో యువత ఆధారిత ఆవిష్కరణలు, వ్యాపారారంభాలను పెంపొందించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకుడు నాగతిమ్మయ్య విద్యార్థులతో ఆవిష్కాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామకృష్ణ, వసుందరమ్మ, బడే సాహెబ్, ఉమామహేశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రవికుమార్, వరలక్ష్మీ, చంద్రకళ, రామన్న, నీతమ్మ పాల్గొన్నారు.



ఆవిష్కాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

నీట్‌లో సత్తాచాటిన విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన విద్యార్థి ప్రవీణ్‌కుమార్ నీట్ పరీక్షలో ప్రతిభ కనబరచి ఎంబీబీఎస్ సీటు సాధించాడు. సంజామల మండలం ముక్కమల్లకు చెందిన ప్రవీణ్‌కుమార్ 2021–23 విద్యా సంవత్సరంలో కోవెలకుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ పూర్తి చేశాడు. ఇటీవల జరిగిన జాతీయ స్థాయి వైద్య ప్రవేశ పరీక్ష (నీట్)లో 720 మార్కులకు గాను 510 మార్కులు సాధించి కర్నూలు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందాడు. మంగళవారం కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు మద్దిలేటి స్వామి, వెంకటరమణ, నూర్జహాన్, సుబ్బరాయుడు తదితరులు శాలువా, పూలమాలతో సత్కరించి అభినందించారు.

ఐరన్‌ఓర్ లారీల పట్టివేత

బేతంచెర్ల: డోన్ మండలం మల్కాపురం నుంచి విశాఖపట్నంకు వెళ్తున్న రెండు ఐరన్‌ఓర్ లారీలను బేతంచెర్ల చెక్‌పోస్టు వద్ద భూగర్భ గనుల శాఖ అధికారులు అడ్డుకున్నారు. లారీల బిల్లులు ఎండార్స్ కాకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నట్లు భూగర్భ గనుల శాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు రామాంజనేయరెడ్డి, శ్రీనివాసులురెడ్డి తెలిపారు. అనంతరం రెండు లారీలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. జరిమానా విధించేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్లు తెలిపారు.



సీజ్ చేసిన లారీ

రూ. 21 లక్షల ఎరువుల అమ్మకాలు నిలుపుదల

ప్యాపిలి: పట్టణంలోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాల్లో మంగళవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రాష్ట్రంలో యూరియా కొరత నెలకొన్న నేపథ్యంలో యూరియా అక్రమ నిల్వలపై విజిలెన్స్ అధికారుల తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు కర్నూలు విజిలెన్స్ ఏఓ విశ్వనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో కామధేను ఫర్టిలైజర్స్‌లో రూ.12,50,025, సౌజన్య ఫర్టిలైజర్స్‌లో రూ.8,94,600 విలువ చేసే వివిధ రకాల ఎరువులకు సరైన బిల్లులు, ఇతర రికార్డులు లేనట్లు గుర్తించారు. సంబంధిత సరుకు అమ్మకుండా విజిలెన్స్ అధికారులు ఆదేశించినట్లు ప్యాపిలి ఏఓ రాజేష్ తెలిపారు.



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ఏజీపీగా కురువ లక్ష్మన్న



డోన్ : వెల్దుర్తి మండలం గువ్వలకుంట్ల గ్రామానికి చెందిన న్యాయవాది కురువ లక్ష్మన్నను ప్రభుత్వం అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమించింది. ఈ సందర్భంగా డోన్ బార్ అసోసియేషన్ సభ్యులు ఆయనను అభినందించారు.

పరామర్శ

బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మానిపాటి వెంకటేశ్వర్లు అనారోగ్యంతో బాధపడుతూ కోలుకున్నాడు. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, పార్టీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, మురళీకృష్ణ, ఎద్దులన్న, కుమార్, గోరుమానుకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, పట్టణ కన్వీనర్ తిరుమలేశ్వర్ రెడ్డి, మండల కన్వీనర్ జాకీర్ హుసేన్ తదితరులు ఆయనను పరామర్శించారు. ఏవైనా ఇబ్బందికర పరిస్థితులు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని, ఎప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన 'దసరా' పంచాయితీ

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో దసరా మామూళ్ల పంచాయితీ మంగళవారం రాత్రి పోలీస్ సర్కిల్ ఆఫీసుకు చేరింది. ఈ నెల 22వ తేదీ నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం కానుండడంతో, కోవెలకుంట్ల–నంద్యాల ప్రాంతాలకు చెందిన హిజ్రాలు రెండు రోజులుగా పట్టణంలోని దుకాణాలకు తిరుగుతూ మామూలు వసూలు చేస్తున్నారు. వ్యాపారులు ఇచ్చిన మొత్తానికి సరిపోకుండా రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు డిమాండ్ చేయడంతో అసహనం వ్యక్తం చేసిన వారు మూకుమ్మడిగా సర్కిల్ కార్యాలయానికి చేరుకుని సీఐ హనుమంతునాయక్‌ను కలిశారు. దీంతో సీఐ జోక్యం చేసుకుని హిజ్రాలను పిలిపించి విచారణ జరిపారు. హిజ్రాలకు మూడు బృందాలు ఉన్నాయని, ఒక్కో బృందానికి వేర్వేరుగా మామూలు ఇవ్వాల్సిందేనని వారు చెప్పగా, దీనికి వ్యాపారులు ఒప్పుకోలేదు. చివరికి సీఐ సర్దిచెప్పి, మూడు బృందాలు కలిసి ఒకటిగా వచ్చి వ్యాపారులను ఇబ్బంది పెట్టకుండా, వారు ఇచ్చినంత మొత్తాన్ని మాత్రమే స్వీకరించాలని సూచించారు.

ఎట్టకేలకు తెరుచుకున్న భవనం

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె జెడ్పీ హైస్కూల్ నూతన భవనం ఎట్టకేలకు విద్యార్థుల వినియోగానికి అందుబాటులోకి వచ్చింది. గతంలో అదనపు గదులు లేక విద్యార్థులు ప్రాథమిక పాఠశాలలోనే కొనసాగుతుండగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ×నాడు–నేడు¥ పథకంలో భాగంగా 11 గదుల నిర్మాణానికి సుమారు రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే నిధుల విడుదలలో జాప్యం కారణంగా కింది అంతస్తు గదులు పూర్తికాగా, పై అంతస్తు గదుల పనులు మాత్రం పూర్తి కాలేదు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు, గ్రామ సర్పంచ్ శ్రీరాములు ప్రత్యేక చొరవ తీసుకుని పూర్తయిన గదుల్లో అవసరమైన సదుపాయాలు కల్పించారు. మంగళవారం ఈ భవనాన్ని గ్రామ సర్పంచ్ శ్రీరాములు, వైస్ ఎంపీపీ రంగస్వామి ప్రారంభించారు.



సర్పంచ్, వైస్ ఎంపీపీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాప్రతినిధులతో అమర్యాదగా ప్రవర్తించడం సరికాదు

- డోన్ మున్సిపల్ కమిషన్‌ను హెచ్చరించిన ఆర్‌డీ నాగరాజు
- మున్సిపల్ చైర్మన్, పాలకవర్గ సభ్యుల ఫిర్యాదుతో విచారణ
- పునరావృతం కాకుండా చూసుకుంటానని కమిషనర్ హామీ



కౌన్సిలర్లతో మాట్లాడుతున్న మున్సిపల్‌శాఖ రాయలసీమ రీజనల్ డైరెక్టర్ నాగరాజు

డోన్: ప్రజాప్రతినిధులతో అమర్యాదకరంగా ప్రవర్తించడం మంచిదికాదని మున్సిపల్ శాఖ రాయలసీమ రీజనల్ డైరెక్టర్ నాగరాజు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌ను హెచ్చరించారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రజాప్రతినిధులను అగౌరవపరిచే విధంగా ప్రవర్తిస్తున్నారని కౌన్సిలర్లు, చైర్మన్ ఫిర్యాదు చేయడంతో ఆయన మంగళవారం మున్సిపల్ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, సీపీఐ కౌన్సిలర్ సుంకయ్యతో పాటు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, దినేష్‌గౌడ్, మౌలాబీ, మిట్టా ఉమామహేశ్వరి, మీనాక్షి, వెంకటేశ్వరమ్మ, పద్మావతి, శివలక్ష్మి తదితరులు కమిషనర్ వ్యవహారశైలిపై మండిపడ్డారు. సమావేశాలు సక్రమంగా నిర్వహించకపోవడం, కౌన్సిలర్లను ఆహ్వానించకపోవడం, ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం, కౌన్సిల్ అనుమతి లేకుండా న్యాయసలహాదారుని నియమించడం, వార్డుల్లో సభలు జరిపినా కౌన్సిలర్లను పక్కన పెట్టడం వంటి విషయాలను వారు ఎత్తిచూపారు. అదే విధంగా మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి వాకింగ్‌కు వచ్చే సమయంలో మున్సిపల్ గేటుకు తాళం వేసి అవమానించారని, కౌన్సిల్ ఆమోదం లేకుండా ఉద్యోగ నియామకాల్లో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపించారు. పట్టణంలో ఖాళీ స్థలాల్లో స్వయంగా బంకులు వేయించి ఆక్రమణలకు ప్రోత్సాహం ఇస్తున్నారని కూడా విమర్శించారు. డైరెక్టర్ నాగరాజు దృష్టికి ఇవన్నీ తీసుకెళ్లారు. ఏఈ, ఈఈతో పాటు కొందరు అధికారులతో సమన్వయ లోపం కారణంగా పొరపాట్లు జరిగిన విషయాన్ని కమిషనర్ అంగీకరించారు. ఇకపై ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూస్తానని డైరెక్టర్ నాగరాజుకు హామీ ఇచ్చారు. పరస్పర సంప్రదింపులతో సమస్యలను పరిష్కరించుకోవాలని, కాకపోతే వివాదాలు సృష్టించుకోవడం తగదని కమిషనర్‌కు డైరెక్టర్ నాగరాజు సూచించారు.